
సాక్షి
రాజన్న సిరిసిల్ల
ఆదివారం । 23 । జూలై । 2023



నిండుకుండలా ఎగువమానేరు

గంభీరావుపేట(సిరిసిల్ల): నర్మాల ఎగువమానేరు ప్రాజెక్టు నిండుకుండలా మారింది. కూడవెల్లి, పాల్వంచ వాగుల ద్వారా వరద వస్తుండడంతో 29 అడుగుల నీరు వచ్చింది.



ఎల్‌ఎండీకి నీటి విడుదల

బోయినపల్లి(చొప్పదండి): మిడ్‌మానేరు నుంచి కరీంనగర్ ఎల్‌ఎండీకి శనివారం 3,060 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులో 15.33 టీఎంసీల మేర నీరు నిల్వ ఉంది.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
27.0/24.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

విధుల్లో చేరిన ఆర్డీవో ఆనంద్‌కుమార్



సిరిసిల్ల: సిరిసిల్ల ఆర్డీవోగా ఆనంద్‌కుమార్ శనివారం విధుల్లో చేరారు. గత ఐదేళ్లుగా ఇక్కడ పనిచేసిన టి.శ్రీనివాస్‌రావు హైదరాబాద్ శేరిలింగంపల్లికి బదిలీ కాగా.. ఆయన స్థానంలో కరీంనగర్ ఆర్డీవోగా ఉన్న ఆనంద్‌కుమార్ నియమితులయ్యారు. కలెక్టర్ అనురాగ్ జయంతిని కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందించారు. బాధ్యతలు స్వీకరించిన ఆనంద్‌కుమార్‌కు కలెక్టర్ అనురాగ్ జయంతి, ఆర్డీవో ఆఫీస్ అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.

'ఇల్లంతకుంట ఎస్సైని సస్పెండ్ చేయాలి'



ఇల్లంతకుంట(మానకొండూర్): పొత్తూరుకు చెందిన దళిత యువకులు ర్యాగటి అజయ్, తోడేటి అరవింద్‌లను చిత్రహింసలకు గురిచేసిన ఇల్లంతకుంట ఎస్సై రాజేశ్‌ను సస్పెండ్ చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మికసంఘం జిల్లా అధ్యక్షుడు గన్నారం నర్సయ్య కోరారు. శనివారం బాధిత యువకులను పొత్తూరులో పరామర్శించి మాట్లాడారు. కూలీ పనులు చేస్తూ, ట్రాక్టర్ నడుపుకుంటున్న యువకులపై ఎస్సై దాడి చేయడం సరికాదన్నారు. చిత్రహింసలు పెట్టిన విషయాన్ని బయటపెడితే కేసులు పెడతానని బెదిరింపులకు గురిచేయడం దారుణమన్నారు. బాధితులకు న్యాయం జరిగే వరకు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పోరాడుతామన్నారు. దళిత యువకులను చిత్రహింసలకు గురిచేసిన ఎస్సైని వెంటనే సస్పెండ్ చేయాలని కోరారు. మేంద అనిల్, రాములు, శంకర్, శ్రీనివాస్, పర్శరాం తదితరులు ఉన్నారు.

'ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడుతాం'



ముస్తాబాద్(సిరిసిల్ల): బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడుతామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లగిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. ముస్తాబాద్‌లో శనివారం విలేకరులతో మాట్లాడారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇస్తామనే హామీతో అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్ నాయకులు ఇప్పుడు ఆ విషయాన్ని మర్చిపోయారన్నారు. దళితబంధు కోసం లక్షలాది మంది ఎస్సీలు ఎదురుచూస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. బీసీలకు రూ.లక్ష కోసం జిల్లాలో 14 వేల దరఖాస్తులు వస్తే మండలానికి 30 మందికి కూడా ఇవ్వడం లేదన్నారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. నాయకులు మేర్గు హన్మంత్‌గౌడ్, సంతోష్‌రెడ్డి, మెంగని మహేందర్, మీస సంజీవ్, కోల కృష్ణ, బాద నరేశ్, కుడుకల జనార్దన్, శ్రీకాంత్, బండి శ్రీకాంత్ ఉన్నారు.

హాస్టళ్ల సమస్యలు పరిష్కరించండి



కోనరావుపేట(వేములవాడ): సాంఘిక సంక్షేమ హాస్టళ్లలోని సమస్యలు పరిష్కరించాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి అంగూరి రంజిత్‌కుమార్ కోరారు. మండలంలోని ధర్మారం హాస్టల్‌ను శనివారం సందర్శించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యావ్యవస్థను విస్మరిస్తోందన్నారు. ధరలకు అనుగుణంగా విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలు, మెస్ చార్జీలను పెంచాలని కోరారు. భవనం పైకప్పు లీకవుతుందని వెంటనే మరమ్మతు చేయాలని కోరారు. చంటి ప్రసాద్, సాకేశ్ తదితరులు పాల్గొన్నారు.



ఇది సిరిసిల్ల మున్సిపాలిటీలోని శ్రీనగర్‌కాలనీరోడ్డు. కనుచూపు మేర బురదతోనే కనిపిస్తుంది. సీసీ రోడ్డు వేయాలని ఏళ్లుగా విన్నవిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. వర్షాకాలం వచ్చిందంటే అడుగుతీసి అడుగువేయడం కష్టమైతుంది.



ఇది సిరిసిల్లమున్సిపాలిటీ శివారు కాలనీ జ్యోతినగర్. మున్సిపాలిటీలో విలీనమై ఏళ్లు గడుస్తున్నా రోడ్లను అభివృద్ధి చేయడం లేదు. అభివృద్ధి పథంలో ముందున్న ఫస్ట్‌గ్రేడ్ మున్సిపాలిటీలోని శివారుకాలనీల రోడ్లు పల్లెలను తలపిస్తున్నాయి.

శివారుకాలనీలు.. చిత్తడిరోడ్లు

- సిరిసిల్ల శివారుకాలనీలు అధ్వానం
- అడుగుతీసి.. వేయలేం
- వానొస్తే బురదమయం
- పట్టింపు లేని పాలకులతో ప్రజలకు కష్టాలు



సిరిసిల్ల ఆర్టీసీ డిపో-కొత్తబస్టాండు రోడ్డు

సిరిసిల్లటౌన్: అభివృద్ధిలో దూసుకెళ్తున్న సిరిసిల్ల మున్సిపాలిటీ శివారు ప్రాంతాలు అధ్వానంగా ఉన్నాయి. లోతట్టు ప్రాంతాల ప్ర'జల' కష్టాలు తీరడం లేదు. బురదరోడ్లపై అడుగుతీసి.. అడుగు వేయలేని పరిస్థితులు ఉన్నాయి. అత్యవసర పనిమీద బయటకు వెళ్తున్న వారిలో సగం మంది బురదలో జర్రున జారిపడుతున్నారు. శివారుకాలనీల్లోనే ఈ సమస్యలు ఉన్నాయనుకుంటే పొరపాటు పడ్డట్టే. పట్టణ నడిబొడ్డు సుభాష్‌నగర్, గోపాల్‌నగర్, ఆర్టీసీ డిపో రోడ్డు, సాయినగర్ ప్రాంత ప్రజలను బురద కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి.

సిరిసిల్ల ప్రొఫైల్	
వార్డులు	39
జనాభా	1,16,938
రోడ్లు	210 కి.మీ
బీటీ రోడ్లు	10 కి.మీ
సీసీరోడ్లు	137.44 కి.మీ
మట్టిరోడ్లు	72.54 కి.మీ

పట్టింపు లేక పరేషాన్

సిరిసిల్ల మున్సిపల్ పరిధి సుమారు 210 చ.కి.మీ విస్తరించి ఉంది. మంత్రి కేటీఆర్ చొరవతో మున్సిపాలిటీ అభివృద్ధిలో దూసుకెళ్తోంది. అన్ని వార్డుల్లో కలిపి 147 కి.మీలో 10కి.మీ బీటీ రోడ్లు, 137 కి.మీ సీసీ రోడ్లు ఉన్నాయి. మరో 72.54 కి.మీ రోడ్లు నిర్మించాల్సి ఉంది. ఐదేళ్ల క్రితం చుట్టుపక్కల గల ఏడు గ్రామాలైన పెద్దూరు, సర్దాపూర్, చంద్రంపేట, రగుడు, రాజీవ్‌నగర్, పెద్దబోనాల, చిన్నబోనాలను కలుపుకుని ఫస్ట్‌గ్రేడ్ మున్సిపాలిటీగా ఆవిర్భవించింది.

అభివృద్ధి లో'పాలు' ఇలా..

- అన్ని వార్డుల్లో మౌలిక వసతుల కల్పనకు రూ.100 కోట్లు కేటాయించారు. వీటిని సద్వినియోగం చేయడంలో అధికారులు, పాలకులు సఫలం కావడం లేదు.
- చెరువు కాల్వల కబ్జాతో ఏటా వర్షాకాలంలో వరదపోటెత్తి రోడ్లు దెబ్బతింటున్నాయి.
- శివారుకాలనీల్లో రోడ్లు అధ్వానంగా ఉన్నాయి.
- ప్రధాన రహదారులను రూ.14 కోట్లతో విస్తరించారు. డివైడర్లు, సెంట్రల్ లైటింగ్, గ్రీనరీ, సర్కిళ్లను నిర్మించారు. రూ.100 కోట్ల వరకు రోడ్ల నిర్మాణానికే వెచ్చించడం విశేషం.
- సిరిసిల్లలో రోడ్లను మిషన్ భగీరథ పైపులైన్ కోసం తవ్వడం, విలీన గ్రామాల్లో రోడ్ల అభివృద్ధిలో వేగం లేకపోవడంతో బురద సమస్య తలెత్తుతుంది.



సిరిసిల్ల అయ్యప్ప ఆలయం ఏరియాలోని రోడ్డు

ఇబ్బందులు పడుతున్నాం



చంద్రంపేట, జ్యోతినగర్‌లలో మట్టిరోడ్లు బురదమయంగా మారుతున్నాయి. రోడ్లపైనే డ్రెయినేజీ నీరు నిలిచి దుర్వాసన వస్తుంది. దోమలు పెరిగి రోగాల బారిన పడుతున్నాం. అధికారులు స్పందించాలి.
– సుల్తాన్ బాలు, చంద్రంపేట

బురదరోడ్డులో ప్రయాణం కష్టం



విలీన గ్రామాల్లో ఇప్పటికీ కొన్ని చోట్ల మట్టి రోడ్లే ఉన్నాయి. గుంతలుగా ఉన్న రహదారులపై ప్రయాణించడం కష్టంగా ఉంది. మొరంతో గుంతలను పూడ్చాలి. సీసీ రోడ్లు నిర్మించి శాశ్వత పరిష్కారం చూపాలి. – గంగుల భాస్కర్, పెద్దూరు

సీసీ రోడ్లు నిర్మించాలి



పెద్దూరు 9వ వార్డులో బాబాజీనగర్, సబ్‌స్టేషన్ నుంచి వెళ్లేదారి అస్తవ్యస్తంగా ఉంది. సిరిసిల్లలో వీలినమై ఏళ్లు గడుస్తున్నా అభివృద్ధికి నోచుకోవడం లేదు. సీసీ రోడ్లు నిర్మించాలి.
– తుమ్మ విజయ్, 9వ వార్డు పెద్దూరు

వృద్ధుల పరిరక్షణకు ప్రత్యేక చట్టాలు

- సీనియర్ సివిల్ జడ్జి శ్రీలేఖ
- రంగినేని ట్రస్టులో న్యాయవిజ్ఞాన సదస్సు



సిరిసిల్లటౌన్: వృద్ధుల పరిరక్షణకు ప్రత్యేక చట్టాలు ఉన్నాయని సిరిసిల్ల సీనియర్ సివిల్ జడ్జి శ్రీలేఖ పేర్కొన్నారు. స్థానిక రంగినేని ట్రస్టులో శనివారం నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడారు. బడీడు పిల్లలను చదివించాలని, వారిని పనిలో పెట్టుకునే వారిపై చట్టరీత్యా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. నిరుపేదలకు కోర్టులో ఎలాంటి రుసుం చెల్లించకుండానే ఉచిత న్యాయ సేవలు అందుతాయన్నారు. న్యాయసేవా సమితి సభ్యుడు చింతోజు భాస్కర్, ట్రస్టు నిర్వాహకులు రంగినేని సుజాతమోహన్‌రావు, తూడి వెంకట్రావు, న్యాయవాదులు ఆడెపు వేణు, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

సిరిసిల్ల డీఎస్పీ ఉదయ్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ



సిరిసిల్లక్రైం: సిరిసిల్ల డీఎస్పీగా ఉదయ్‌రెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా పోలీస్ ఆఫీస్‌లో ఎస్పీ అఖిల్ మహాజన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి సేవలందిస్తానని ఉదయ్‌రెడ్డి తెలిపారు. శాంతిభద్రతల విషయంలో సహకరించాలని కోరారు.

అప్రమత్తతతో సైబర్ మోసాలకు చెక్

సిరిసిల్లక్రైం: సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రకటనలో తెలిపారు. సైబర్ నేరం జరిగితే వెంటనే టోల్ ఫ్రీ నంబర్లు 1930, డయల్ 100కు కాల్ చేయాలని సూచించారు. గత ఆరు నెలల్లో 22 ఫిర్యాదుల్లో బాధితులు రూ.17,82,433 కోల్పోయారని, రూ.8,32,360 ఫ్రీజ్ చేసినట్లు వివరించారు.

నాలుగేళ్లుగా నలుగుతున్నాం

- ఆగమవుతున్న శివారుకాలనీల జనం
- వేములవాడలో వరదొస్తే తరలిపోవుడే..
- తాత్కాలిక ఉపశమనంతోనే సరి
- శాశ్వత పరిష్కారం కరువు



ఇళ్లు ఖాళీ చేసి వెళ్తున్న జనం

వేములవాడ ప్రొఫైల్
జనాభా 45 వేలకు పైగా..
వార్డులు 28
శివారుకాలనీలు 10
ముంపునకు గురయ్యే కాలనీలు 06
శివారుకాలనీల్లో నివాసాలు 50కి పైగా

వేములవాడ: చిన్నపాటి వర్షం పడితే చాలు వేములవాడ మున్సిపల్ పరిధిలోని బేడబుడగ జంగాల కాలనీలోనికి వరదనీరు వచ్చి చేరుతుంది. ఏటా వర్షాకాలంలో ఈ ప్రాంత ప్రజలు సురక్షిత ప్రాంతానికి తరలివెళ్లాల్సి వస్తోంది. శాశ్వత పరిష్కారం చూపాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో వీరి వరద కష్టాలు పరిష్కారం కావడం లేదు. శివారుకాలనీలను పట్టించుకోకపోవడంతోనే ఈ సమస్య ప్రతీసారి వస్తోందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

30 కుటుంబాలు

వేములవాడ మున్సిపల్ శివారుకాలనీలకు ఎటా వరదముప్పు పొంచి ఉంటుంది. చిరుజల్లులకే నివాసాల్లోకి వరద వచ్చి చేరుతుంది. వరుసగా నాలుగు రోజులు కురిసిన వర్షానికి వేములవాడ శివారులోని బేడబుడగజంగాల కాలనీలోకి వరదనీరు వచ్చి చేరింది. ఇక్కడ నివసిస్తున్న 30 కుటుంబాలను అధికారులు సురక్షిత ప్రాంతానికి తరలించారు. ఇక్కడికి వచ్చి శాశ్వత నివాసాలు నిర్మించుకుని నాలుగేళ్లుగా ఇక్కడే ఉంటున్న తమకు ఈ వరదముప్పును ఎప్పుడు తప్పిస్తారని వారు ప్రశ్నిస్తున్నారు. ఈ కాలనీతోపాటు మల్లారంరోడ్డుకు ఇరువైపులా ఉన్న కాలనీలు సైతం వర్షాకాలంలో ముంపునకు గురవుతున్నాయి.

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల ఊసేలేదు

ఈ ప్రాంతంలోని నిరుపేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇస్తామని చెబుతున్న అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటి వరకు ఒక్కరికి కూడా డబుల్ ఇల్లు ఇవ్వలేదు. వరదలొచ్చినప్పుడు మాత్రమే వస్తూ పునరావాస చర్యలు చేపడుతున్నారే తప్ప శాశ్వత పరిష్కారం చూపడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు.

వానొస్తే పరుగులు తీసుడే



వేములవాడ శివారులోని కోనాయపల్లి రోడ్డులో బుడగజంగాల కాలనీలోకి వరదనీరు వచ్చి చేరుతుండడంతో సురక్షిత ప్రాంతానికి తరలివెళ్తున్నాం. ప్రతీసారి ఇబ్బందులు పడుతున్నాం. వర్షమొస్తే వణుక్కుంటూ ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ఇంటి సామగ్రి సర్దుకునుడే. వరద వచ్చిందంటే చాలు బయటకు వెళ్లాల్సి వస్తోంది.
– వానరాసి భాగ్యవ్వ, బేడబుడగజంగాల కాలనీ

తాత్కాలిక చర్యలే..



శివారుకాలనీల్లో లోతట్టు ప్రాంతాల్లో జనం వరదలతో ఇబ్బందులు పడుతున్నారు. నాలుగేళ్లుగా శాశ్వత పనులు చేపడతామంటున్న అధికారులు తాత్కాలిక చర్యలతోనే సరిపుచ్చుకుంటున్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇవ్వడం లేదు. వర్షాకాలంలో భయంతోనే బతుకుతున్నాం.
– మోతె వెంకటస్వామి, స్థానికుడు

వరద సహాయక చర్యలు చేపడతాం



ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు శివారు కాలనీల్లోని జనాలకు సహాయక చర్యలు చేపడుతున్నాం. వరదలతో ఇబ్బందులు పడుతున్న కాలనీల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నాం. ప్రభుత్వం నిధులు మంజూరు చేయగానే శాశ్వత పనులు చేపడతాం.
– రాజిరెడ్డి, తహసీల్దారు

సీజనల్ వ్యాధులను నియంత్రించాలి

- డ్రై డే పాటించాలి
- మిషన్ భగీరథ ట్యాంకులు శుభ్రం చేయాలి
- జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ
- జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశాలు



సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు

సిరిసిల్ల: జిల్లాలో సీజనల్ వ్యాధులను నియంత్రించాలని, వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ సూచించారు. జెడ్పీ ఆఫీస్‌లో శనివారం నిర్వహించిన జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశాలలో అరుణ మాట్లాడారు. నివాస ప్రాంతాలలో మురికినీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. వర్షాకాలంలో డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంటుందని, వీటిని నియంత్రించేందుకు ప్రతి శుక్ర, మంగళవారాల్లో డ్రై డే పాటించాలన్నారు. పైపులైన్ లీకేజీలను అరికట్టాలని, మిషన్ భగీరథ ట్యాంకులను శుభ్రం చేయాలని సూచించారు. గురుకుల విద్యాలయాలు, హాస్టళ్లను జిల్లా అధికారులు తరచూ తనిఖీలు చేస్తూ విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందేలా చూడాలన్నారు.

రైతులు ప్రత్యామ్నాయ పంటలు వేయాలి

రైతులు వరి, పత్తి పంటలే కాకుండా ప్రత్యామ్నాయ పంటలు సాగుచేసేలా వ్యవసాయాధికారులు ప్రోత్సహించాలని సూచించారు. ఆయిల్‌పామ్ ఎక్కువగా సాగుచేసేలా అవగాహన కల్పించాలని కోరారు. జిల్లాలోని చెరువులు, జలాశయాల్లో నాణ్యమైన పెద్ద చేపలు వేసేలా చూడాలని, చేపల వేట మత్స్యకారులకు లభిస్తున్న ఉపాధిపై అధికారులు ప్రచారం కల్పించాలన్నారు. నిర్మాణంలో ఉన్న రోడ్లు, ఇతర అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు.

మహిళలపై వేధింపులు నిరోధించాలి

జిల్లాలో మహిళలపై వేధింపులు, గృహహింస వంటి వాటిని కట్టడి చేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ కోరారు. వరకట్న వేధింపులు, పోక్సో కేసులు, సీనియర్ సిటిజెన్స్‌పై వేధింపులపై తక్షణమే స్పందించి బాధితులకు అండగా ఉండాలని కోరారు. సఖీ కేంద్రంపై ప్రజల్లో ప్రచారం చేయాలన్నారు. జెడ్పీ సీఈవో గౌతమ్‌రెడ్డి, విద్య, వైద్యం, ప్రణాళిక ఆర్థిక, గ్రామీణాభివృద్ధి నిర్మాణ పనుల స్టాండింగ్ కమిటీలకు జెడ్పీ చైర్‌పర్సన్ అధ్యక్షత వహించగా.. వ్యవసాయంపై వైస్‌చైర్మన్ సిద్ధం వేణు, మహిళా సంక్షేమంపై తంగళ్లపల్లి జెడ్పీటీసీ పూర్మాణి మంజుల, సాంఘిక సంక్షేమంపై బోయినపల్లి జెడ్పీటీసీ కత్తెరపాక ఉమ అధ్యక్షత వహించారు. జెడ్పీటీసీలు నాగం కుమార్, కొమిరిశెట్టి విజయ, గట్ల మీనయ్య, జెడ్పీ కో-ఆప్షన్ సభ్యులు చాంద్‌పాషా, అహ్మద్ పాల్గొన్నారు.

ఘనంగా దాశరథి జయంతి

సిరిసిల్లకల్చరల్: తెలంగాణ వైతాళికుడు దాశరథి కృష్ణమాచార్య జయంతిని శనివారం సిరిసిల్లలోని కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించారు. దాశరథి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. గ్రంథాలయసంస్థ అధ్యక్షుడు శంకరయ్య మాట్లాడుతూ ఆరు భాషల్లో ప్రావీణ్యుడైన దాశరథి ఆనాటి నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ధిక్కార స్వరం వినిపించారని కొనియాడారు. జనవిజ్ఞాన వేదిక ప్రతినిధి చెన్నమాధవుని రామరాజు, లైబ్రేరియన్ శంకరయ్య, కార్మికసంఘం నేత వెంగల వెంకటేశం, చిలుముల ఎల్లయ్య, కమటం మల్లయ్య పాల్గొన్నారు.

కవుల నివాళి

జిల్లా రచయితల సంఘం, సిరిసిల్ల సాహితీ సమితి ఆధ్వర్యంలో అంబేడ్కర్ సర్కిల్‌లో దాశరథికి నివాళి అర్పించారు. కవులు జనపాల శంకరయ్య, జూకంటి జగన్నాథం, వెంగల నాగరాజు, వెంగల లక్ష్మణ్, బూర దేవానందం, టీవీ నారాయణ, శ్రీనివాస్, వెంకటేశం, అంకాలపు రవి, విఠల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కేంద్ర గ్రంథాలయంలో నివాళి అర్పిస్తున్న కవులు, రచయితలు

క్లుప్తంగా

పరామర్శ



పరామర్శిస్తున్న మహేందర్‌రెడ్డి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): పదిరకు చెందిన కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు చెరుకు ఎల్లయ్య తండ్రి కొమురయ్య మరణించగా వారి కుటుంబ సభ్యులను ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి శనివారం పరామర్శించారు. దుమాలలో రెండు రోజుల క్రితం మృతిచెందిన ఉల్లి కిష్టయ్య కుమారులు శేఖర్, రాజేశ్, నరేశ్‌లను పరామర్శించారు. మండలాధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, నాయకులు లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, దేవయ్య, బుచ్చాగౌడ్, రాజునాయక్, బాబు, రవి పాల్గొన్నారు.

వీర్నపల్లి(సిరిసిల్ల): మద్దిమల్లలో అనారోగ్యానికి గురైన పార్టీ నాయకుడు ప్యాట్ల మల్లయ్యను మహేందర్‌రెడ్డి పరామర్శించారు. అడవిపదిరలో పని నర్సింగం తల్లి వారంకింద మృతిచెందగా కుటుంబ సభ్యులను పరామర్శించారు.

హాస్టళ్లకు పక్కా భవనాలు నిర్మించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న రవిగౌడ్

సిరిసిల్లఅర్బన్: సంక్షేమ హాస్టళ్లు, గురుకులాలకు పక్కా భవనాలు నిర్మించాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కోఆర్డినేటర్ కంచర్ల రవిగౌడ్ కోరారు. సిరిసిల్లలోని బీసీ బాలుర వసతిగృహాన్ని శనివారం సందర్శించి సమస్యలు తెలుసుకున్నారు. బీసీ, ఎస్సీ, మైనార్టీ హాస్టళ్లు అరకొర వసతులతో అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయన్నారు. బీసీ విద్యార్థి సంఘం పట్టణ అధ్యక్షుడు రుద్రవేణి సుజిత్, నాయకులు నవీన్, రామ్, సురేష్ ఉన్నారు.

పార్లమెంట్ సమావేశాల్లో వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలి



బొప్పాపూర్‌లో మాట్లాడుతున్న లక్ష్మణ్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే ప్రవేశపెట్టాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఖానాపురం లక్ష్మణ్ కోరారు. మండలంలోని వెంకటాపూర్, రాచర్లబొప్పాపూర్ గ్రామాల్లో శనివారం నూతన కమిటీలను ఏర్పాటు చేసి మాట్లాడారు. వర్గీకరణను చట్టబద్ధత చేసుకుంటేనే పిల్లల భవిష్యత్ బాగుంటుందన్నారు. మంద కృష్ణమాదిగ ఈ నెల 27న జిల్లాకు వస్తున్నారని, సన్నాహక సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. చంద్రయ్య, ప్రవీణ్, వెంకటేశ్, దేవయ్య, మల్లయ్య, రాజయ్య, నారాయణ, బాలయ్య, మల్లేశ్, ప్రశాంత్, నర్సయ్య పాల్గొన్నారు.

తెగిన బంధాలు

- పల్లెలకు నిలిచిన రాకపోకలు
- వంతెనలపై నుంచి పారుతున్న వరదనీరు
- గ్రామాలకే పరిమితమవుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

జిల్లాలో రోడ్ల వివరాలు ఇలా..(కి.మీ.లలో)	
రోడ్ల విస్తీర్ణం	595.869
బీటీ రోడ్ల విస్తీర్ణం	570.061
మట్టి రోడ్లు	5.05
సీసీ రోడ్లు	20.308
పీఆర్ రోడ్లు	1,041
ఆర్‌అండ్‌బీ రోడ్లు	595
లోలెవల్ వంతెనలు, కల్వర్టులు	102



ఇది ఎల్లారెడ్డిపేట మండలం పదిర–రామలక్ష్మణపల్లి గ్రామాల మధ్య మానేరువాగుపై గల లోలెవల్ వంతెనపై పారుతున్న వరదనీరు. లోలెవల్ వంతెన మునిగిపోవడంతో ఈ మార్గంలో సిరిసిల్ల–సిద్దిపేట జిల్లాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. రూ.6 కోట్లతో వంతెన నిర్మించాలనే లక్ష్యం నీరుగారిపోయింది. ఫలితంగా ఏటా వర్షాకాలంలో ప్రయాణికులకు వరదకష్టాలు ఎదురవుతూనే ఉన్నాయి.



ఇది ఎల్లారెడ్డిపేట మండలం అక్కపల్లి శివారులోని లేతమామిండ్లవాగుపై గల లోలెవల్ కల్వర్టుపై పారుతున్న వరదనీరు. గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షానికి పై ప్రాంతం నుంచి వస్తున్న వరదతో వాగు పొంగుతోంది. ఫలితంగా కోనరావుపేట–ఎల్లారెడ్డిపేట మండలాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. ఇక్కడ కూడా వంతెన నిర్మించాలన్న ప్రతిపాదనలు బుట్టదాఖలయ్యాయి. ఇలాంటి పరిస్థితులు జిల్లా వ్యాప్తంగా 102 లోలెవల్ కల్వర్టుల వద్ద ఉంది. ఏటా వర్షాకాలంలో రెండు నుంచి మూడు నెలల వరకు ఇదే పరిస్థితులు ఉంటున్నాయి.

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఏకధాటిగా కురుస్తున్న వర్షాలతో జిల్లాలో వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. లోవెవల్ వంతెనల పై నుంచి వరదనీరు పారుతుండడంతో చాలా ప్రాంతాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పల్లెల్లో ప్రజాజీవనం స్తంభించింది. పలు పల్లెలకు మండల కేంద్రాలతో సంబంధాలు తెగిపోయాయి. జిల్లా వ్యాప్తంగా 1,636 రహదారులు ఉండగా 102 రోడ్లు వరద ప్రవాహంతో కల్వర్టులపై నుంచి నీరు పారుతోంది. చందుర్తి, రుద్రంగి, కోనరావుపేట, వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట, ఇల్లంతకుంట, ముస్తాబాద్ మండలాల్లో అధిక వర్షాలతో కల్వర్టులు మునిగిపోయాయి. ఒక్క ఎల్లారెడ్డిపేట ఉమ్మడి మండలంలో నాలుగు రూట్లలో 8 లోలెవల్ కల్వర్టులతో 17 గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి.



పదిర–రామలక్ష్మణులపల్లి గ్రామాల మధ్య వాగు పొంగడంతో నిలిచిన రాకపోకలు

ప్రయాణం నరకం

- ఎల్లారెడ్డిపేట మండలం పదిర, ముస్తాబాద్ మండలం రామలక్ష్మణపల్లి మధ్య గల మానేరు పొంగిపొర్లుతుండడంతో ఈ ప్రాంత ప్రజలు సిద్దిపేట, ముస్తాబాద్, దుబ్బాక ప్రాంతాలకు వెళ్లడం కష్టంగా మారింది.
- అక్కపల్లి వద్ద లేతమామిళ్లవాగు పొంగుతుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి.
- ఆపద సమయంలో ఆస్పత్రులకు వెళ్లడానికి ఎలాంటి అవకాశం లేకుండా పోవడంతో గిరిజన ప్రాంత ప్రజలు భయంభయంగా కాలం వెళ్లదీస్తున్నారు.
- జిల్లాలోని 102 లోలెవల్ వంతెనలు, కల్వర్టులు ఉండగా.. అన్ని ప్రాంతాల్లో వరదనీరు ప్రవహిస్తుండడంతో జనజీవనం స్తంభించింది. ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్‌శాఖ అధికారులు రోడ్ల దుస్థితిపై స్పందించడం లేదు. కనీసం వంతెనలను పరిశీలించడం లేదు.
- తండాలు, పల్లెల మధ్య తెగిన రోడ్లను గ్రామపంచాయతీ నిధులతోనే మరమ్మతులు చేసుకోవాలని ఆదేశాలిస్తున్నారు.

శాశ్వత పరిష్కారం చూపాలి



పదిర–రామలక్ష్మణులపల్లి గ్రామాల మధ్య మానేరువాగుపై వంతెన కలగానే మిగులుతోంది. శాశ్వత వంతెన నిర్మించాలని జిల్లా ప్రజలతోపాటు సిద్దిపేటకు చెందిన 30 గ్రామాల ప్రజలు చేస్తున్న కోరుతున్నారు. మానేరువాగుపై గతేడాది కురిసిన భారీ వరదలతో కొట్టుకుపోయిన లోలెవల్ కల్వర్టుకు మరమ్మతులు చేయలేదు.

– సత్యంరెడ్డి, పదిర

ప్రతిపాదనలు పంపాం

ఎడతెరపిలేకుండా కురుస్తున్న వర్షాలతో లోలెవల్ కల్వర్టులపై నుంచి వరద నీరు పారుతోంది. జిల్లాలో లోలెవల్ వంతెనలను గుర్తించి నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కాగానే పనులు చేపడతాం. తండాలు, పల్లెల మధ్య రోడ్లు తెగిపోతే గ్రామపంచాయతీ నిధులతో మరమ్మతులు చేసుకోవాలని సూచించాం. వర్షాకాలంలో పొంగుతున్న కల్వర్టులపై నుంచి ప్రయాణాలు చేయవద్దు. – శ్రీనివాస్, పీఆర్, డీఈఈ, సిరిసిల్ల

లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి



వరదకాల్వ పనులు పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ జిందం కళ

సిరిసిల్లటౌన్: వరద ముప్పు తప్పించేలా లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ పేర్కొన్నారు. అధికారులతో కలిసి శ్రీనగర్‌కాలనీ, బైపాస్‌రోడ్డు సమీపంలోని ముంపు ప్రాంతాలను శనివారం పరిశీలించారు. కచ్చా కాల్వలో ఎలాంటి అడ్డంకులు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, కమిషనర్ వెల్దండి సమ్మయ్య, కౌన్సిలర్లు రాపెల్లి దినేశ్, అడ్డగట్ల మాధవి, డీఈ ప్రసాద్, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, మున్సిపల్, ఇరిగేషన్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

దొంగ అరెస్టు



పల్లెపు నవీన్

వేములవాడ: వేములవాడతోపాటు పరిసర గ్రామాల్లో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న పల్లెపు నవీన్(30)ను శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెంకటేశ్ తెలిపారు. సిద్దిపేట జిల్లా తొగుట మండలం తుక్కాపూర్‌కు చెందిన నవీన్‌ను అగ్రహారం ఆలయం వద్ద పట్టుకున్నట్లు సీఐ చెప్పారు. రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

తలో చేయి వేశారు.. రోడ్డు బాగు చేశారు

వేములవాడరూరల్: ఎవరో వస్తారు.. ఏదో చేస్తారు.. అని ఎదురుచూడకుండా వారే ముందుకొచ్చారు. తలోచేతు వేసి రోడ్డును బాగుచేసుకుని ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. వేములవాడ రూరల్ మండలంలోని బొల్లారం, హన్మాజీపేట గ్రామాల మధ్య రోడ్డు గుంతలుగా ప్రయాణానికి ఇబ్బందిగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు బురదమయంగా మారడంతో నడిచివెళ్లే పరిస్థితి కూడా లేకుండా పోయింది. బొల్లారం గ్రామానికి చెందిన కొందరు యువకులు రోడ్డును బాగు చేసేందుకు నడుం బిగించారు. స్థానికంగా ఉన్న వారితోపాటు విదేశాల్లో ఉన్న వారు చందాలు పంపడంతో రోడ్డుపై మట్టిపోసి బాగుచేసుకున్నారు. యువకులు చేసిన ఈ పనికి గ్రామస్తులు అభినందిస్తున్నారు.



చందాలతో బాగుచేసిన రోడ్డు

గుండెపోటుతో వృద్ధుడి మృతి

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని జిల్లెల్ల గ్రామానికి చెందిన ఎదుల్లా లక్ష్మీనారాయణ(60) శుక్రవారం అర్ధరాత్రి తర్వాత గుండెపోటుతో మరణించాడు. నిరుపేద కుటుంబం కావడంతో పలువురు చందాలు వేసి అంత్యక్రియలు నిర్వహించారు. మృతునికి భార్య, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు.

రుణాలిప్పిస్తానని మోసం చేసిన వ్యక్తిపై కేసు

గంభీరావుపేట(సిరిసిల్ల): దళితబంధు, ఎస్టీ కార్పొరేషన్ రుణాలిప్పిస్తానని డబ్బులు దండుకొని మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు గంభీరావుపేట ఎస్సై మహేశ్ తెలిపారు. మండలంలోని మల్లుపల్లికి చెందిన మరాటి సురేశ్ అదే గ్రామానికి చెందిన మారవేని పద్మకు హార్వెస్టర్, లారీ, భూములు ఇప్పిస్తానని మాయమాటలు చెప్పి రూ.20లక్షల వరకు తీసుకొని మోసం చేసినట్లు ఎస్సై తెలిపారు. మాచారెడ్డి మండలం లచ్చపేటకు చెందిన నాలాపురం సురేశ్ వద్ద దళితబంధు కోసం రూ.లక్ష, ఎల్లారెడ్డిపేట మండలానికి చెందిన భూక్య లక్ష్మి, లకావత్ రాజ్యానాయక్‌ల వద్ద ఎస్టీ కార్పొరేషన్ రుణాలు ఇప్పిస్తానని రూ.60వేలు తీసుకొని మోసం చేసినట్లు ఎస్సై వివరించారు. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఇంకా బాధితులు ఉంటే పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలని కోరారు.

మొక్కలు నాటిన జెడ్పీ చైర్‌పర్సన్



మొక్క నాటుతున్న చైర్‌పర్సన్ అరుణ

సిరిసిల్ల: జిల్లా ప్రజాపరిషత్ ఆఫీస్ ఆవరణలో శనివారం చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ మొక్కలు నాటారు. ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్ జన్మదినం సందర్భంగా, గ్రీన్ ఇండియా చాలెంజ్ సారథి జోగినపల్లి సంతోశ్‌కుమార్ చాలెంజ్‌లో భాగంగా మొక్కలు నాటారు. జెడ్పీ సీఈవో బి.గౌతమ్‌రెడ్డి, జెడ్పీటీసీ కత్తెరపాక ఉమ, గట్ల మీనయ్య, జెడ్పీ డిప్యూటీ సీఈవో గీత, బీఆర్‌ఎస్ నాయకులు కత్తెరపాక కొండయ్య పాల్గొన్నారు.

'మణిపూర్ నిందితులను శిక్షించాలి'



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మణిపూర్‌లో మహిళలపై జరిగిన అఘాయిత్యానికి బాధ్యులుగా దేశ ప్రధాని మోదీ, ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి బీరేన్‌సింగ్ రాజీనామాలు చేయాలని, నిందితులను శిక్షించాలని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, ఏఎంసీ మాజీ చైర్మన్ అందె సుభాష్ కోరారు. ఎల్లారెడ్డిపేటలోని జెడ్పీటీసీ ఆఫీస్‌లో శనివారం విలేకరులతో మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక దళితులు, ఆదివాసీలు, మహిళలపై వేధింపులు ఎక్కువయ్యాయన్నారు. ఎల్లారెడ్డిపేట సింగిల్‌విండో అధ్యక్షుడు గుండారపు కృష్ణారెడ్డి, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు బండారి బాల్‌రెడ్డి, గుండారం సర్పంచ్ భూక్య శంకర్ నాయక్, ఏఎంసీ మాజీ చైర్మన్ గుల్లపల్లి నరసింహారెడ్డి, నాయకులు ఎద్ల సందీప్, భూక్య సీత్యానాయక్, గోషిక దేవదాస్, కొలనూరి శంకర్, ఆకుల మురళీమోహన్‌గౌడ్ ఉన్నారు.

నిందితులను శిక్షించాలి



సిరిసిల్లటౌన్: మణిపూర్ ఘటనలోని నిందితులను శిక్షించాలని జిల్లా గోర్‌బంజారా, ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేశాయి. ఈమేరకు శనివారం సిరిసిల్ల కొత్తబస్టాండు నుంచి గాంధీచౌక్ వరకు బైక్‌ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ చౌరస్తాలో నిరసన తెలిపారు. టీఎస్‌టీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శర్మాన్‌నాయక్, జిల్లా అధ్యక్షుడు హజనాయక్, టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుమాల రమానాథ్‌రెడ్డి, గన్నమనేని శ్రీనివాస్‌రావు, గుగులోతు సురేష్‌నాయక్, అజ్మీరనాయక్, గోపినాయక్, భూక్యారెడ్డినాయక్, తిరుపతినాయక్ పాల్గొన్నారు.

జిల్లాలో ఎస్సైల బదిలీ

సిరిసిల్లక్రైం: జిల్లాలోని పోలీసు అధికారుల బదిలీలు కొనసాగుతున్నాయి. నిన్నటి వరకు సీఐ స్థాయి అధికారుల కేటాయింపులు జరగ్గా శనివారం రాత్రి జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్లకు ఎస్సైలను కేటాయిస్తూ ఎస్పీ అఖిల్ మహాజన్ ఉత్తర్వులు జారీ చేశారు. వీటిలో గంభీరావుపేట ఎస్సై మినహా మిగతా అధికారులను బదిలీ చేశారు.

పేరు	ప్రస్తుతం	బదిలీ స్థానం
వెంకటేశ్వర్లు	ముస్తాబాద్	తంగళ్లపల్లి
కె.శేఖర్	కరీంనగర్	ముస్తాబాద్
రమాకాంత్	కోనరావుపేట	ఎల్లారెడ్డిపేట
నవత	సిరిసిల్లటౌన్	వీర్నపల్లి
శ్రీనివాస్‌రావు	కరీంనగర్	సిరిసిల్లటౌన్
మారుతి	సిరిసిల్ల ఎస్బీ	వేములవాడరూరల్
ఎస్.అశోక్	కరీంనగర్	చందుర్తి
డి.అంజనేయులు	కామారెడ్డి	కోనరావుపేట
జి.జ్యోతి	సిద్దిపేట	వేములవాడటౌన్
జె.రమేశ్	చందుర్తి	వేములవాడటౌన్
శ్రీరామ్ ప్రదీప్	ఎల్లారెడ్డిపేట	రుద్రంగి

జగిత్యాలలో 'జోయలుక్కాస్'

- మూడు రోజుల పాటు ఆభరణాల ప్రదర్శన



ప్రదర్శన ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్

జగిత్యాల: ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఆభరణాల వర్తకులైన జోయలుక్కాస్ వారు జగిత్యాలలో ఆభరణాల ప్రదర్శన ప్రారంభించారు. మూడు రోజుల పాటు సాగే ఆభరణాల ప్రదర్శనను మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, జగిత్యాలలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఆభరణాల వర్తకులైన జోయలుక్కాస్ వారు ప్రదర్శన నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జోయలుక్కాస్ తెలంగాణ రీజినల్ మేనేజర్ రోబిన్‌తంబి, వినియోగదారులు పాల్గొన్నారు.

అలరించిన 'అల్ఫోర్స్ డాజిల్–2023'



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న నరేందర్‌రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్): హన్మకొండలోని అల్ఫోర్స్ జూనియర్ కళాశాలలో శనివారం జరిగిన 'అల్ఫోర్స్ డాజిల్–2023' అలరించింది. హన్మకొండలోని ఓ ప్రైవేట్ వేడుక మందిరంలో జరిగిన కార్యక్రమంలో భాగంగా జ్ఞాన సరస్వతీదేవి విగ్రహానికి పూలమాల వేసిన అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అత్యుత్తమ ప్రదనర్శన కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

హమ్మయ్యా.. గెరువిచ్చింది



ఎల్లారెడ్డిపేటలో వరి నారు తీస్తున్న మహిళలు

ఈ ఏడాది వర్షాపాతం వివరాలు (మిల్లీ మీటర్లలో)				
మండలం	శనివారం	ఈ ఏడాది	గతేడాది	సాధారణం
రుద్రంగి	35.0	323.8	632.4	323.9
చందుర్తి	41.9	437.2	851.7	319.4
వేములవాడరూరల్	17.7	317.9	664.6	315.3
బోయినపల్లి	34.0	306.6	732.9	270.1
వేములవాడ	33.0	389.0	743.4	313.4
సిరిసిల్ల	16.0	311.9	755.1	299.4
కోనరావుపేట	19.4	324.4	638.5	272.1
వీర్నపల్లి	16.8	365.5	510.0	282.7
ఎల్లారెడ్డిపేట	16.4	415.7	669.8	273.1
గంభీరావుపేట	11.5	415.4	692.8	271.9
ముస్తాబాద్	9.9	426.6	620.5	241.0
తంగళ్లపల్లి	13.0	380.4	593.3	303.1
ఇల్లంతకుంట	9.6	301.2	604.9	226.9
మొత్తం	21.1	362.7	670.0	285.6

- చందుర్తిలో అత్యధికంగా 41.9 మి.మీ
- ఇల్లంతకుంటలో అత్యల్పంగా 9.6 మి.మీ
- మత్తడి దూకిన చెరువులు 12
- సగమే నిండిన చెరువులు 436

సిరిసిల్ల: వారం రోజులకు వర్షం గెరువిచ్చింది. జిల్లా వ్యాప్తంగా కురిసిన భారీ వర్షాలతో రోడ్లు, కల్వర్టులు, లోలెవల్ వంతెనలు కోతకు గురయ్యాయి. జిల్లావ్యాప్తంగా శనివారం సాయంత్రం వరకు పొడి వాతావరణం నెలకొంది. వ్యవసాయ పనులు జోరందుకున్నాయి. వరినాట్లు వేస్తూ.. పత్తిలో కలుపు తీస్తూ.. ఎరువులు వేస్తూ.. రైతులు బిజీబిజీగా మారారు. జిల్లాలో 2.40 లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతుండగా.. అత్యధికంగా 1.62 లక్షల ఎకరాల్లో వరి, 74 వేల ఎకరాల్లో పత్తి సాగుచేస్తున్నారు.

సాగునీటి వనరుల్లోకి వరద

- గంభీరావుపేట మండలం నర్మాల ఎగువ మానేరులోకి 29 అగుడుల నీరు చేరింది. మరో నాలుగు అడుగుల నీరు చేరితే మత్తడి దూకనుంది. కామారెడ్డి, సిద్దిపేట జిల్లాల నుంచి పాల్వంచ, కూడెల్లి వాగుల్లో వరద నీరు కొనసాగుతుంది.
- బోయినపల్లి మండలం మాన్వాడ వద్ద ఉన్న మిడ్ మానేరులో ప్రస్తుతం 15.34 టీఎంసీల నీరు నిల్వ ఉంది.
- జిల్లాలోని 436 చెరువుల్లోకి సగమైనా నీరు రాలేదు. కేవలం 12 చెరువులు నిండి మత్తడి దూకుతున్నాయి. 50 నుంచి 75 శాతం నీరు 131 చెరువుల్లోకి వచ్చింది. 75 నుంచి 100 శాతం నీరు 77 చెరువుల్లోకి చేరింది. మొత్తంగా జూలైలో సాగునీటి వనరుల్లోకి వరదనీరు రావడంతో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి.

జిల్లా యంత్రాంగం అప్రమత్తం

కలెక్టర్ అనురాగ్ జయంతి కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి జిల్లాలో పరిస్థితులను సమీక్షించారు. టెలీకాన్ఫరెన్స్ ద్వారా క్షేత్రస్థాయి అధికారులతో మాట్లాడుతూ ప్రాణ, ఆస్తినష్టం జరుగకుండా పరిస్థితులను చక్కదిద్దారు. వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులను, క్షేత్రస్థాయి సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఎస్పీ అఖిల్ మహాజన్ పోలీసు యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి ప్రమాదకరంగా ఉన్న కల్వర్టులు, లోలెవల్ వంతెనల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేయించారు.